నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 27 మార్చి 2023

బీర్కూర్ ఎస్ఐగా సాయిరెడ్డి



నవతెలంగాణ-నసురుల్లాబాద్

కామారెడ్డి జిల్లా బీర్కూర్ నూతన ఎస్ఐగా సాయిరెడ్డి కామారెడ్డి నుంచి బదిలీపై వచ్చారు. బీర్కూర్ పోలీస్ స్టేషన్కు ఎస్ఐ పోస్ట్ గత ఆరు నెలల నుంచి ఖాళీగా ఉండడంతో మండల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తరచూ రోడ్డు ప్రమాదాలు, అక్రమ ఇసుక రవాణా, మండల కేంద్రంలో దొంగల బీభత్సం, సివిల్ తగాదాలు పెరిగిపోవడం, గత కొన్ని నెలలుగా ఎవరూ రాకపోవడంతో ఎట్టకేలకు ఉన్నతాధికారులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ నియమించడంతో బీర్కూర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుపై మురికి నీరు

- కాలనీవాసుల ఇబ్బందులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 1వ నెంబర్ ఎర్రమన్ను కుచ్చు కాలనీలో రోడ్డుపై మురికి నీరు రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్డు మొత్తం చిత్తడిగా మారటంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా నీరు రోడపైనే నిల్వ ఉంటున్నాయని, నాయకులు స్పందించి సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



కాంగ్రెస్‌లోకి డీఎస్, సంజయ్

తిరిగి హస్తం పార్టీలోకి

- జిల్లాలో మారనున్న సమీకరణాలు
- జిల్లా నాయకత్వం మౌనం

బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు, పీసీసీ మాజీ చీఫ్ ధర్మపురి శ్రీనివాస్ మళ్లీ హస్తం గూటికి చేరారు. కొన్ని సంవత్సరాలుగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఆయన బీఆర్ఎస్ రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆ సమయంలోనే ఆయన పార్టీ మారుతారని వార్తలు వచ్చాయి. అయితే ఆయన కాషాయం పార్టీలోకి చేరుతారని మొదట ప్రచారం జరిగింది. కానీ వాటన్నింటికీ తెరదించుతూ కాంగ్రెస్‌లో చేరారు. డీఎస్‌తో పాటు ఆయన కుమారుడు, నిజామాబాద్ మాజీ మేయర్ సంజయ్ సైతం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.



గాంధీభవన్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకున్న డి.శ్రీనివాస్, కుమారుడు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో కీలక నేత, బలమైన సామాజిక తరగతికి చెందిన డి.శ్రీనివాస్ మళ్లీ హస్తం గూటికి చేరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత ఆయన కేసీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఆయనకు బీఆర్ఎస్‌లో రాజ్యసభ ఎంపీగా ఎంపిక చేశారు. రాజ్యసభ సభ్యుడిగా అయిన తరువాత కొంత కాలం పాటు ఆ పార్టీలో చురుగ్గా వ్యవహరించినప్పటికీ.. ఆ తరువాత రాజకీయంగా కొంత వెనక్కి తగ్గారు. అయితే పార్టీలో సరైన ప్రాధాన్యత లేకపోవడంతో ఆయన బీఆర్ఎస్ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎస్‌కు వ్యతిరేకంగా జిల్లాలో ఆ పార్టీ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ ఫిర్యాదులు చేశారు. అయితే ఆ సమయంలోనే ఆయన రాజీనామా చేస్తారని వార్తలు వచ్చాయి. అదే సమయంలో నిజామామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లోని మున్నూరుకాపు సంఘంలో ఆయన మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో తన రాజకీయ భవిష్యత్తును ప్రకటిస్తారని అంతా భావించారు. కానీ ఆయన వ్యూహాత్మక మౌనం పాటించారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేయబోమని, ఒకవేళ ఆ పార్టీ సస్పెండ్ చేస్తే అప్పుడు నిర్ణయం తీసుకుంటానని అన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తే రాజ్యసభ సభ్యత్వం రద్దు అవుతుందన్న కారణంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ అధినాయకత్వం సైతం ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. కానీ నాటి నుంచి ఆయన బీఆర్ఎస్ కార్యక్రమాలన్నింటికీ దూరంగా ఉంటూ వస్తున్నారు.

మళ్లీ హస్తంలోకి...

రాజకీయంగా కొన్నేండ్లుగా మౌనంగా ఉన్న డీఎస్.. మళ్లీ హస్తం పార్టీలోకి చేరారు. మొదట తను ఏ పార్టీలోకి చేరబోనని ప్రకటించినప్పటికీ.. గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ సీనియర్ నాయకుల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు ఆయన పెద్దకుమారుడు సంజయ్ సైతం కాంగ్రెస్‌లో చేరారు. అయితే రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్‌గా నియామకం అయిన ఆరంభంలోనే సంజయ్.. రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆ సమయంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరిగింది. కానీ ఆ సమయంలో మర్యాదపూర్వకంగానే కలిశానని చెప్పారు. కానీ తాజాగా ఆదివారం తండ్రి డీఎస్‌తో ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం వచ్చేనా?

కామారెడ్డి జిల్లాతో పోల్చితే నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు నాయకత్వలేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ఛరిష్మా ఉన్న నేత లేకపోవడంతో పార్టీ శ్రేణులు కొన్నేండ్లుగా స్తబ్దుగా ఉన్నాయి. డీఎస్ మళ్లీ హస్తంలో చేరడంతో జిల్లాలో ఆ పార్టీకి కలిసి వచ్చే అవకాశముంది. పైగా డీఎస్ సామాజిక తరగతి జిల్లాలో బలంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆ బలం మళ్లీ కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అవకాశముంది. అయితే జిల్లాలో సంజయ్... కాంగ్రెస్ శ్రేణులను ఎలా సమన్వయం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. కాగా డీఎస్ చిన్న కుమారుడు ధర్మపురి అరవింద్ నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఉన్న విషయం తెలిసిందే.

ఇంటర్ పరీక్షలో మాస్ కాపీయింగ్ ?

- మైక్రో జిరాక్స్‌తో చిట్టీలు
- ఇన్విజిలెటర్ల సహకారంతోనే కాపీయింగ్



నవతెలంగాణ-భిక్కనూర్

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాల్సిన ఇన్విజిలెటర్లే.. మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దోమకొండ మండలంతో పాటు భిక్కనూర్ మండలాల్లో ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జోరుగా సాగుతోంది.

భిక్కనూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కలిపి ఒకేచోట ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే పకడ్బందీగా నిర్వహించాల్సిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో కొందరు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్టు సమాచారం. రేపటి పరీక్షకు సంబంధించిన చిట్టీలను కొందరు విద్యార్థులు జిరాక్స్ సెంటర్ల సహకారంతో పరీక్షకు సంబంధించిన బుక్కులను మైక్రో జిరాక్స్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు తీసుకెళుతున్నట్టు సమాచారం. విద్యార్థులు మైక్రో జిరాక్స్ తీసుకుని పరీక్షలు రాస్తున్నా ఇన్విజిలేటర్లు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని.. కొందరు కష్టపడి చదువుతున్న విద్యార్థులు నిరుత్సాహం చెందుతున్నారు. జోరుగా మాస్‌కాపీ జరుగుతున్నా ఇంటర్మీడియట్ పరీక్ష నిర్వహణ అధికారులు మాత్రం పరీక్ష కేంద్రాలను తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని, మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న, వారికి సహకరిస్తున్న ఇన్విజిలెటర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు

ఇంటర్మీడియట్ పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థులు, ఇన్విజిలెటర్లపై చర్యలు తీసుకుంటాం. పరీక్ష కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్‌తో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం



పూత వచ్చినా.. కాత కాయలే..

- నకిలీ విత్తనాలతో మోసం
- లబోదిబోమంటున్న రైతు

నవతెలంగాణ-మద్నూర్

నకిలీ విత్తనాలతో రైతు మోసపోయిన ఘటన మండలంలోని గోజేగావ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాజేశ్వర్ దేశ్‌ముఖ్ అనే రైతు మహారాష్ట్రలోని కౌట బారూర్ గ్రామంలోని గజానన్ కర్షి కేంద్ర దుకాణం వ్యాపారి వద్ద మెడికల్ రకం మిర్చి పంట విత్తనాలను కొనుగోలు చేశాడు. కిలోకు రూ.12 వేలు చెల్లించి మొత్తం నాలుగు కిలోలు రూ.48 వేల చెల్లించి కొనుగోలు చేశాడు.

రెండు ఎకరాలలో మిర్చి పంట సాగు చేయగా పంట పంగలు వేయకుండా పూత వచ్చింది. కానీ కాత ఏమాత్రం కాయ లేదని రైతు తెలిపాడు. ఆ వ్యాపారి సొంత గ్రా మం నందన్‌వన్ కాగా.. వ్యాపారి పేరు విట్టల్ పవర్‌గా రైతు చెప్పాడు. నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన తన పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరాడు.



కాతకాయని పంట వద్ద రైతు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన సెర్ప్ ఉద్యోగులు

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 3900 మంది సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతన పేస్కేల్ ఇచ్చేందుకు సంబంధించిన జి.ఓ నెం.11 విడుదల చేసినందుకు గానూ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు, ఎల్లారెడ్డి శాసన సభ్యులు జాజాల సురేందర్‌కు కామారెడ్డి జిల్లా సెర్ప్ ఉద్యోగ సంఘం ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా సమావేశమవున్న ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సీ డి.విఠల్‌ను సైతం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గడచిన కాలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సెర్ప్ ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఉన్నా ఎమ్మెల్యే జాజాల సురేందర్ తమకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించారని అందుకు వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపిన వారిలో డీపీఎం సుధాకర్, ఏపీఎం రాజిరెడ్డి, రాజు, నాగరాజు, సాయిలు, గంగరాజు, నరసింహులు, మండలాల సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అనిల్ వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దొనికేని రేనవ్వ (34) మొదటి భర్త అనారోగ్యంతో మృతి చెందగా, రెండవ పెండ్లి చేసుకుంది. కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో రెండవ భర్తతో విడిపోగా.. అన్నారంలో తల్లిదండ్రులతో ఉంటోంది. ఒంటరి జీవితంతో మానసికంగా కృంగిపోయి, మనస్థాపం చెంది శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్‌లో సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. సగ్గు శేఖర్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూ.26వేలు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్‌ల సహాయ సహకారంతో చెక్కును అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు టి.అంజయ్య, సొసైటీ డైరెక్టర్ అగ్గు నారాయణ, తిరుపతి రాము, వేణు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ధరలు పెంచి నడ్డివిరుస్తున్న మోడీ

- బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-రామారెడ్డి

నరేంద్రమోడీ ధరలు పెంచి పేదప్రజల నడ్డి విరుస్తున్నాడని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని మండలాధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళవలసిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. 30 సంవత్సరాల్లో ఏ ఎమ్మెల్యే పర్యటించనన్నిసార్లు, తాను ప్రతి గ్రామాన్నీ పర్యటించానని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత రైతుబీమా, రైతుబంధు, మహిళలకు రెండు నెలల గర్భిణీకి కావలసిన పౌష్టికాహారం, కేసీఆర్ కిట్టు, రూ.13000, కళ్యాణలక్ష్మి తదితర పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైళ్లను, ఓడలను, విమానాశ్రయాలను విక్రయానికి పెడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డి.విట్టల్, ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్రావు, రైతుబంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, రైతుబంధు డైరెక్టర్ కాసర్ల రాజేందర్, ఎస్ఎస్‌నగర్ జెడ్పీటీసీ నర్సింలు, సత్యంరావ్, తానాజీరావు, స్థానిక సర్పంచ్ దండ బోయిన సంజీవ్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

తెలంగాణ పథకాలకు కేంద్రం అవార్డులు

- ఎమ్మెల్యే హనుమంత్ షిండే

నవతెలంగాణ-బిచ్కుంద

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయాలని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో అమలు చేస్తున్నారని, ఇక్కడ అమలవుతున్న పథకాలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తున్నదని జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే అన్నారు. ఆదివారం మండలంలోని బాజీనగర్ గ్రామంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తూ పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేశారని గ్రామాల్లోని ప్రతి ఇంటిలో తెలంగాణలో అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా అమలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తెలంగాణలో అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం నిర్వహించి రాబోయే ఎన్నికల్లో అధికారం సాధించుకుందామని అన్నారు. ఎంపీపీ అశోక్ పటేల్, సర్పంచ్ తోట అనూహ్య లక్ష్మి నారా యణ, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగ నాథ్ పటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీహరి రాజు, ఎంపీటీసీ బండకింది సాయిలు, ఉప సర్పంచ్ బద్రి సాయిలు, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షులు బసవరాజ్ పటేల్, సర్పంచులు గంగారెడ్డి, అరుణ్‌కు మార్, శివ నందప్ప, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వెంకటరావు దేశాయ్, సీనియర్ నాయకులు అసద్ అలీ, హాజీలక్ష్మణ్, హాజీ బాల్రాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షిండే

మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్ భూమిపూజ..

మండలంలోని వాజీద్‌నగర్ గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే రూ.10 లక్షల ప్రత్యేక నిధులతో మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మున్నూరు కాపుల అభివృద్ధికి తనవంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం

- మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం కొనసాగిందని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. యువత ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండెల్లి సాయిలు, చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు రాజయ్య, రజక సంఘం మండల అధ్యక్షుడు తిమ్మాజివాడి రాజయ్య, ఉప సర్పంచ్ దామోదర్, జిల్లా కార్యదర్శి సంగయ్య, బీజేపీ నాయకులు నరసింహారెడ్డి, రూపేందర్‌రెడ్డి, విటల్, భూమేష్, రజక సంఘం అధ్యక్షుడు రాజు సభ్యులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

28న సావర్‌గావ్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-జుక్కల్

మార్చి 28వ తేదీన నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ కార్యకర్తలు, సర్పంచులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని, ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని మండల కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హన్మంత్ షిండే ముఖ్య అతిథిగా రానున్నారని, బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను, రాబోయే రోజులలో పార్టీ నిర్వహణపై సమ్మేళనం ఉంటుందని వివరించారు.

గండివేట్‌లో వైభవంగా బోనాలు



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గండివేట్ గ్రామంలో ముత్యాల పోచమ్మ బోనాల పండుగను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పునర్నిర్మించిన తర్వాత తొలిసారిగా బోనాల పండుగ కావడంతో ఊరంతా ఏకమై పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పుల చప్పుల్లు, డీజేసౌండ్‌ల మధ్య గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా బోనాలను ఊరేగించి ఆలయంలో సమర్పించారు.

కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశవనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామంలో కార్మిక సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్ల చిన్న ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా సాకలి రాజు, కోశాధికారిగా మ్యాదరి సుధాకర్, కార్యదర్శిగా మ్యాదరి బాణు, సలహాదారులుగా తెనుగు రాజయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అందజేత

నవతెలంగాణ-ముప్కాల్



జిల్లా బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్‌కు రూ.50 వేల రూపాయల విలువ చేసే సెల్ ఫోన్‌ను అందజేశారు. మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన నరేష్ బద్రి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్న సందర్భంగా శనివారం రాత్రి ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి, సర్పంచ్ జక్క మల్లు బాయి గంగాధర్ కలిసి ఫోన్‌ను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

భూములు పంచండి

ఎమ్మెల్యే బాజిరెడ్డికి మల్కాపూర్ గ్రామస్తుల మొర

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రూరల్ మండలంలోని మల్కాపూర్, లక్ష్మాపూర్ గ్రామస్తులు ఆదివారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి తమకు భూములు పంచాలని మొర పెట్టుకున్నారు. 339 సర్వే నెంబర్ లో 360 ఎకరాల భూములు ఉన్నాయని, ఈ భూముల కోసం ఏళ్ల నుండి పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. సుమారు రెండు వందల కుటుంబాలు ఉన్నాయని, అన్యాయంగా వీటిలో ప్రొక్లేన్‌లు పెట్టి ధాత్రి టౌన్ షిప్ ఏర్పాట్ల కోసం పనులు ప్రారంభం చేశారని ఈ పనులు ఆపాలని ఉద్యమ నాయకులు పిట్ల శ్రీను మల్లేశ్‌తో పాటు మహిళలు వాగ్వివాదానికి దిగారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలని బాజిరెడ్డిని వేడుకున్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వైద్యశిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కోటగల్లి తర్ప పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శాలిని హార్ట్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిజామాబాదు నగరంలోని జిల్లా పద్మశాలి సంఘ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు కూరపాటి కళ్యాణ్, కూరపాటి కార్తీక్, నవీన్ గుజ్జేటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసిజి, షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ... ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించారు. ఏదైనా సమస్యవస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. కోట గల్లి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పకాయల సుదర్శన్, గొంట్యాల రమేష్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు దీకొండ యాదగిరి, పుల్గం హన్మాండ్లు, నగర సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకట్ నర్సయ్య, సంఘం ప్రతినిధులు సిలివేరి గణేష్, ఖైరంకొండ బాల్‌రాజ్, పెంటి రాజు, మచ్చ చంటయ్య, కోట నగేష్ పాల్గొన్నారు.

మార్కెట్ ఉన్నా.. రోడ్లపైనే వ్యాపారాలు

- నిరుపయోగంగా మార్కెట్ మడిగెలు
- వ్యాపారులను ఎంపిక చేయని అధికారులు
- మున్సిపల్ ఆదాయానికి గండి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పాత బస్టాండ్ అంగడి బజార్లో నిర్మించిన కూరగాయల మార్కెట్ మడిగెలు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈమడిగెలను పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి గత సంవత్సరం ఫిబ్రవరి 21న లాంఛనంగా ప్రారంభించారు. వ్యాపారులను ఎంపిక చేసి పంపిణీ చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో మున్సిపాలిటీకి అద్దె రూపంలో వచ్చే ఆదాయానికి గండి పడుతోంది..



నిరుపయోగంగా ఉన్న షెడ్డు

రోడ్డుపైన వ్యాపారాలు...

2018లో టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్). రూపాయలు 1.75 కోట్లతో అప్పటి పాలకవర్గ ప్రతినిధులు పనులు ప్రారంభించారు. దాదాపుగా మూడున్నర సంవత్సరాల తర్వాత గత సంవత్సరం పూర్తయింది .రెండు బ్లాక్ లలో మొత్తం 58 మడిగెలు నిర్మించారు. మరో కోటి రూపాయలు వెచ్చించి ఇదే ఆవరణలో మరో 32 మడిగెలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సైతం ఉన్నాయి. వీటి నిర్మాణంతో ఈ ప్రాంత రైతులు వ్యాపారులకు కూరగాయల విక్రయానికి అణువుగా మారుతుందని అధికారులు భావించారు. ఇక్కడ విక్రయాలు జరిపేందుకు అనేకసార్లు రైతులను కోరిన ఎవ్వరు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వీటిని వ్యాపారులకు కేటాయించి అక్కడే నిత్యం కూరగాయల విక్రయం కొనసాగించేలా అవగాహన కల్పించాల్సి ఉంటుంది. వీటిని పంపిణీ చేయకపోవడంతో రైతులు వ్యాపారులు రోడ్లపైనే విక్రయాలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్నారు.

మడిగెలు ఇప్పిస్తామని వసూళ్లు

అధికార పార్టీ నేత మడిగెలు ఇప్పిస్తానని వ్యాపారులు, రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు గతంలో తీవ్ర చర్చనీయమయ్యాయి. దీంతో ఇతర పార్టీ నేతలు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ అధికారుల నుంచి స్పందన లేదు. నిర్మాణం పూర్తయిన వాటిని అర్హులకు కేటాయిస్తే ఆర్థిక రూపంలో కొంత ఆదాయం సమకూరుతుంది. దీంతో ఒక సంవత్సరం నుండి మున్సిపల్ ఆదాయం కోల్పోవలసి వస్తుంది.

మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి..

ఇప్పటికి ఆ మార్కెట్‌లో విక్రయాలు చేసింది లేదు. ౦ కాని కొత్తగా ప్రజలు, రైతులు వ్యతిరేకిస్తున్న ఇంకో నాన్ వెజ్ మార్కెట్ నిర్మిస్తాం అనటం పాలకవర్గ మూర్ఖత్వానికి నిదర్శనం. నిర్మించిన వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ లో క్రయవిక్రయాలకు రైతుకు, మాంసం అమ్మకం దారులకు కేటాయించక కొత్తది నిర్మిస్తాం అనటం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటమే అని అది కేవలం కమిషన్ల కోసమే చేపట్టే నిర్మాణం అని అన్నారు. మున్సిపల్ పాలకవర్గం కి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణం పూర్తి అయి ఖాళీగా ఉన్న వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌లో క్రయ విక్రయలు జరిగేలా చూడాలి. ప్రస్తుతం నిర్మాణం పూర్తి అయి ఉన్న వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్లో ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్ది మార్పులు చేర్పులు చేయాలి. కాని కొత్తగా ఇంకో మార్కెట్ నిర్మిస్తాం అనడం అనడం సరైన నిర్ణయం కాదు.

కోల వెంకటేష్,
కాంగ్రెస్ నాయకులు, ఆర్మూర్



సమస్యను పరిష్కరిస్తాం

అంగడి బజార్ మార్కెట్లో మడిగెలను అర్హులకు కేటాయించే ప్రక్రియపై దృష్టి సరిస్తాం. పాలకవర్గం అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం..

ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ ఆర్మూర్

ద్విచక్ర వాహనంపై నుండి పడి వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



పిప్లిబాయి మృతదేహం

ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారి 44 పై ఆదివారం ద్విచక్ర వాహనంపై నుండి పడి ఒక వృద్ధాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై నరేష్ కుమార్ వివరాల ప్రకారం.. మోపాల్ మండలంలోని కులాస్‌పూర్ తాండకు చెందిన పిప్లిబాయి (75) గాంధారి మండలం యాచారం తండాలో ఉండే తన కూతురు వద్దకు అల్లుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. మార్గమధ్యంలోని ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి గ్రామశివారులోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై నుండి కింద పడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో అల్లుడు శంకర్ కు గాయాలైనట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్



గంగాధర్ మృతదేహం

మండలంలోని అమీనాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ (59) బైకు అదుపుతప్పి తాటి చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. ఎస్ఐ వినయ్ కుమార్ వివరాల ప్రకారం... లాండ్రీ షాప్ నిర్వహించే గంగాధర్ తన నడిపి కొడుకు బైక్‌పై రామన్నపేట్ గ్రామం నుండి అమీనాపూర్ వెళు తున్నాడు. వేల్పూర్ గ్రామం దగ్గరలో మోతె శివారులో మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే గల తాటి చెట్టుకు గుద్దుకొని అక్కడక్కడే మృతిచెందాడు. భార్య రాజుభాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఆర్మూర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు..

ఆర్థిక సహాయం చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఆదివారం సర్పంచ్ పెండే ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి అన్ని పార్టీల వారికి ఆర్థిక సహాయం చెక్కులు మంజూరు చేయిస్తూ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేదవారికి అండగా అంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుస్సాపురం జీవన్, నవీన్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న ఏర్గట్ల, దోంచంద, బట్టాపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులందరికి కలిపి చెక్కుల రూపంలో వచ్చిన 3 లక్షల 37 వేల రూపాయలను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్,గద్దె రాధ గంగారాం,కట్కం పద్మాసాగర్,ఎంపీటీసీ జక్కని మధుసూదన్, కోఆప్షన్ మెంబర్ అష్రాఫ్, నాయకులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, నెరేళ్ళ లింగారెడ్డి, బద్దం ప్రభాకర్,బద్దం శ్రీనివాస్ రెడ్డి, మారు నరేష్, సున్నపు అంజయ్య, కొలిప్యాక శ్రీనివాస్, రోక్కెడ మోహన్, లక్కం నర్సయ్య, పిట్ల నరేష్, చిల్క కిషన్, ఇమామ్, కుమ్మరి సహదేవ్, కూశ లింబాద్రి, ఓర్సు రాములు, తదితరులు పాల్గొన్నారు

సుకన్య సమృద్ధి యోజనపై విచారణ

నవతెలంగాణ-ఏర్గట్ల



విచారణ చేపడుతున్న ఎస్ఐ

కొన్ని నెలల క్రితం తొర్తి గ్రామానికి చెందిన పోస్ట్ మాస్టర్ మునిమాణిక్యం సాయన్న సుకన్య సమృద్ధి యోజన ఖాతాల పట్ల అవినీతికి (నిధుల దుర్వినియోగానికి)పాల్పడడంతో ఆయనను పోస్టల్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయనపై క్రిమినల్ కేసు సైతం నమోదు అయింది. ఈ విషయమై ఏర్గట్ల ఎస్సై రాజు సుకన్య సమృద్ధి యోజన బాధితులను శనివారం సాయంత్రం విచారించారు. వారు ఇచ్చిన సమాచారాన్ని పై అధికారులకు పంపుతానని అన్నారు. అవినీతికి పాల్పడింది ఎంతటివారైనా విధిచిపెట్టేది లేదని, బాధితులకు అండగా ఉంటామని అన్నారు.

బహిరంగ సభ విజయవంతం

పీయూసీ చైర్మన్ ఆశన్న గారి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మహారాష్ట్రలోని కాందార్-లోహాలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కాందార్-లోహ సభకు మహారాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా లక్షల సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి కేసీఆర్ అఖండస్వాగతం పలికారని ఆయన తెలిపారు. సభకు హాజరైన రైతులు, యువతలో సరికొత్త జోష్ కనిపించిందన్నారు. సభా వేదికపైనుంచి కేసీఆర్ వివరించిన తెలంగాణ మోడల్‌కు మహారాష్ట్ర ప్రజలు జేజేలు పలికారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మహారాష్ట్రలో కూడా అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారని జీవన్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ నాయకత్వంపై ఉన్న అచంచల విశ్వాసంతో మహారాష్ట్రకు చెందిన నేతలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కేసీఆర్ గారి సమక్షంలో బీఆర్ఎస్ లో పెద్ద ఎత్తున చేరినట్టు ఆయన చెప్పారు. అనూహ్యరీతిలో కాందార్-లోహ సభ విజయవంతం కావడం హర్షణీయమన్నారు. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లే కలవరపాటుకు గురయ్యేలా బీఆర్ఎస్ బహిరంగ సభను గ్రాండ్ సక్సెస్ చేసిన మహారాష్ట్ర బీఆర్ ఎస్ నేతలకు, కార్యకర్తలు, ప్రజలకు, తెలంగాణ నుంచి వచ్చిన బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు,ప్రజా ప్రతినిధులకు జీవన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



సభకు వచ్చిన సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-ముప్కాల్

1992-93 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంలో మునిగిపోయారు. అప్పటి గురువులను గౌరవంగా సన్మానించుకున్నారు. విద్యార్థులంతా కలిసి వారి జ్ఞాపకార్థం రూ.40 వేల రూపాయల విలువ చేసే మైక్ సెట్‌ను పాఠశాలకు అందజేశారు. అదేవిధంగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఏలేటి సునీల్ రెడ్డి పాఠశాలకు తనవంతుగా లక్షన్నర రూపాయలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు..



ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఒకే వేదికపై చేరిన పూర్వ విద్యార్థులు

ఐఎన్‌టీఎస్‌లో సత్తాచాటిన తెలంగాణ శ్రీచైతన్య విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్







ఈనెల 25న విడుదలైన పరీక్షా ఫలితాల్లో ఐఎన్‌టీఎస్ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్) జాతీయ పరీక్ష ఫైనల్ ఫలితాల్లో తెలంగాణ శ్రీచైతన్య పాఠశాలలకు చెందిన 10,052 మంది విద్యార్థులు సత్తాచాటి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. వీరిలో 3వ తరగతి చదువుతున్న పి.కృతి శ్రీ, 5వ తరగతి చదువుతున్న గర్నపల్లి చక్రిక, 6వ తరగతి చదువుతున్న పొల్లూరి గణేష్, 7వ తరగతి చదువుతున్న నల్ల శ్రీతమ్ రెడ్డి, 8వ తరగతి చదువుతున్న ముత్యాల అఖిలేష్ లు గ్రాండ్ ప్రైజ్ ల్యాప్‌టాప్‌లను దక్కించుకున్నారు. వీరితో పాటు 26మంది విద్యార్థులు మొదటి బహుమతిగా ట్యాబ్‌లు, గోల్డ్ మెడల్స్, 43 మంది ద్వితీయ బహుమతి, గోల్డ్ మెడల్స్, 60 మంది విద్యార్థులు తృతీయ బహుమతి, గోల్డ్ మెడల్స్ సొంతం చేసుకున్నారు. కన్సోలేషన్ బహుమతి విభాగంలో 2,175 మంది విద్యార్థులు, స్పెషల్ బహుమతి విభాగంలో 130మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. దాదాపు 6వేలమంది విద్యార్థులు గోల్డ్ మెడల్ మెరిట్ సర్టిఫికేట్ సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అభినందిస్తూ తమ పాఠశాలల్లో పోటీ పరీక్షల్లో గెలుపొందే విధంగా కార్యాచరణ రూపొందించడం, దానిని అనుసరిస్తూ పాఠ్యాంశాలు బోధించడం వల్లనే ఇటువంటి అద్భుత ఫలితాలు సాధించగలిగామన్నారు. డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థల్లో అనుసరిస్తున్న పాఠ్యప్రణాళిక ద్వారానే ఇటువంటి ఫలితాలు రావడం జరుగుతుందని స్పష్టం చేశారు. పాఠశాలల డీజీఎంలు, ఆర్ఐలు, పిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, డీన్స్, అకాడమిక్ ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో హెూంగార్డు మృతి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కమాండెంట్ శ్రీనివాస్ రావు
- 60వేల ఆర్థిక సహాయం అందజేత



పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కమాండెంట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడవ బెటాలియన్ లో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఉమండల కేంద్రం లోని పోలీస్ బెటాలియన్‌కు చెందిన కళకొట్టాల భాస్కర్ (45) ఇంటి వద్ద కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. బెటాలియన్ పోలీసుల వివరాల ప్రకారం.. 2006లో తెలంగాణ ప్రత్యేక పోలీస్ ఏడవ బెటాలియన్‌లో హెూంగార్డుగా జాయిన్ అయిన భాస్కర్ బెటాలియన్‌లోనే విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటివద్దనే ఉన్నాడు. సర్వీస్ లైన్ వైర్ తెగి కింద పడిపోవడంతో దాన్ని చేతుల్లో పట్టుకుని సరి చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు రక్షించే ప్రయత్నం చేసిన అప్పటికే భాస్కర్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏడవ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి సత్య శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి భాస్కర్ ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్‌కు భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమ్మార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించినట్లు ఎస్సై కచ్చకాయల గణేష్ తెలిపారు.

యువకులకు క్రికెట్ కిట్టు అందజేత



క్రికెట్ కిట్టు అందజేస్తున్న శ్రీబాలాజీ మెమోరియల్ ఆస్పత్రి వారు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్ నగర్ గ్రామంలోని యువకులకు ఆర్మూర్‌కు చెందిన శ్రీ బాలాజీ మెమోరియల్ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో క్రికెట్ కిట్టు అందజేశారు. బాలాజీ మెమోరియల్ హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ ఉప్పు రాకేష్ మాట్లాడుతూ గ్రామంలో యువకులకు క్రికెట్ కిట్టును అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా బాలాజీ మెమోరియల్ పల్లెటూర్లకు సైతం విస్తరిస్తుందని, మా మెమోరియల్ ద్వారా అందించే సేవలు అందరూ అందుకోవాలని కోరారు. యువకులు మాట్లాడుతూ మారుమూల గ్రామానికి వచ్చి ఆడుకోవడానికి ఉత్సాహం పొందేలా ఇలాంటి క్రికెట్ కిట్టును అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి ప్రోత్సాహాలుఅందించడం ద్వారా ఆటలతో మానసిక ఉల్లాసం పొందుతూ మరింత ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. శ్రీ బాలాజీ మెమోరియల్ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జన్సీరాణి, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళ రాంపూర్‌లో సంత ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో ఆదివారం నూతనంగా అంగడి ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ క్యాతం దేవేందర్, గ్రామకమిటీ అధ్యక్షుడు ఇట్టెడి రాజు మాట్లాడుతూ... ప్రతి ఆదివారం అంగడి జరుగుతుందని, చుట్టుపక్కల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీటీసీ ఆడేం సవిత గంగాప్రసాద్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు బోనగిరి రమేష్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజిరెడ్డి, గ్రామకమిటీ ఉపాధ్యక్షులు తమ్మడి రాజేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూమిని కబ్జా నుంచి కాపాడండి

పోలీస్ స్టేషన్‌లో గ్రామస్థుల ఫిర్యాదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తమ గ్రామ పంచాయతీ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయ డానికి ప్రయత్నాలు చేస్తున్నారని, దీన్ని అడ్డుకోవడానికి గ్రామస్తులు వేళ్తే సర్పంచ్, విడిసి, గ్రామస్తులతో అసభ్యంగా మాట్లాడుతూ దాడికి ప్రయత్నించారనిగ్రామస్తులు ఇందల్ వాయి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లోలం సత్యనారాయణ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో ఇందల్‌వాయి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశామన్నారు. మల్లాపూర్ శివారులోని సర్వే నెంబరు 263లో సుమారు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ డి గ్రామానికి చెందిన జమాలొద్దీన్, షేర్ ఖాన్, జమాలోద్దీన్ (కొడుకు) వారి కుటుంబ సభ్యులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆ భూమి కబ్జా కాకుండా అపడానికి వడ్ల కల్లం కోసం చదును చేయగా వారు అడ్డుకోవడానికి ప్రయత్నించారని తెలిపారు. అధికారులు స్పందించి ఆభూమిని సర్వే చేసే విధంగా చూడాలని వారన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నర్సయ్య, ఆసది రాజన్న, గంగాగౌడ్, సంగు నరాయణ, ఎం.గంగాధర్ రాజేందర్, ప్రవీణ్, గంగాధర్ తోపాటు యువకులు తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

35ఏళ్ళ నుంచి ఆభూమిలో ఉన్నాం

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

35ఏళ్ళ నుండి ఆభూమిలో ఉన్నామని జమాలొద్దీన్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 35 ఏళ్ల నుండి ఆ భూమి తమ కబ్జాలోనే ఉందని, కావాలని రెచ్చగొట్టి ఊరందరిని తీసుకుని వచ్చి మేమే దాడి చేసినట్టు చెప్పడం సరికాదని అన్నారు. సర్వేనెంబర్ 262/ఆ/1లో తాత ముత్తాతల నుండి మూడు ఎకరాల 27 గుంటల భూమి ఉందని తెలిపారు. తండ్రి మృతి చెందడంతో వారసత్వంగా అన్నదమ్ములకు ఆ భూమి దక్కిందని అన్నారు. ఇప్పుడు ఆ భూమిలోకి కొందరు వచ్చి అడ్డు కోవడం సబబు కాదని పేర్కొన్నారు. బతుకుదెరువు కోసం అన్నదమ్ములం గల్ఫ్ దేశాలకు పనులు చేసుకోవడానికి వెళ్ళినప్పుడు ఆ భూమిలో పంటలు వేసేవారు లేక పడీతుగా ఉందన్నారు. ఆదివారం ఉదయం జమాలోద్దీన్ తమ్ముడు షేర్ ఖాన్, కొడుకు సల్మాన్ ముగ్గురు కలిసి ట్రాక్టర్ తీసుకొని భూమిని చదును చేయడానికి వెళ్లారన్నారు. అక్కడికి వెళ్లిన తర్వాత మల్లాపూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ లోలం సత్యనారాయణ, వీడీసీ సభ్యులు కొంతమంది గ్రామస్తులు వచ్చి భూమి మాది అని చెప్పి చదును చేయకుండా అడ్డుకున్నారని వాపోయారు. అసభ్య పదజాలంతో మాట్లాడుతూ తమపై దాడి చేశారని తెలిపారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు..



మాట్లాడుతున్న జమాలొద్దీన్

జల్దిపల్లిలో పెద్దమ్మ బోనాలు



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని జల్దిపల్లి గ్రామంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ బోనాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించారు. అందులో భాగంగా బోనాలు ఊరేగింపు చేపట్టారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మహిళకు అభినందనలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన పద్మ సాయిశ్రీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా ఆదివారం పలువురు నాయకులు ఆమెకు శాలువా కప్పి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి సుభాష్‌రెడ్డి శాలువా కప్పి ఆమెను అభినందించారు.



సివిల్ జడ్జిని అభినందిస్తున్న సుభాష్‌రెడ్డి

నూతన గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని ఉత్నూర్ గ్రామంలో నూతన గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొడ్లే నరేందర్, వైఎస్ చైర్మన్‌గా మొగుళ్ళ నరేష్‌గౌడ్, కోశాధికారిగా చాకలి మైషయ్య, ప్రధాన కార్యదర్శిగా కమ్మరి సుధాకర్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు సమయ పాలన పాటించాలి

- మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ



కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మున్సిపల్ కార్మికులు సమయ పాలన పాటించాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రతి వీధిని శుభ్రంగా ఉంచేలా చూడాలని కోరారు. ఆదివారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేసిన అనంతరం వారితో మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని ప్రతి వాడలోని వీధిలోను శుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కార్మికులను కోరారు. కొంతమంది వ్యాపారులు పలుసార్లు నోటీసులు అందించినప్పటికీ చెత్త రోడ్డుపై వేస్తున్నారని త్వరలోనే కమిషనర్ ద్వారా చర్యలు చేపడతామని అన్నారు. మున్సిపల్ కార్మికులు మున్సిపల్ పరిధిలో పరిశుభ్రతగా ఉంచి తెలంగాణలోనే ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి పేరు వచ్చేలా కృషి చేయాలని కార్మికులను కోరారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య
- గోడ ప్రతులు ఆవిష్కరణ



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

భారత కార్మిక సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 2, 3 తేదీలలో నిర్వహించనున్న నేపథ్యంలో ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బోధన్ పట్టణంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య గోడప్రతులను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తూ కార్మికులను, ఉద్యోగులను బయటకు గెంటి వేస్తున్నారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం 44కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేశారని ఆయన అన్నారు. ఈ మహాసభకు ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ, జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వర్లు, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, కామ్రేడ్ అమితాబ్ హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపుఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీ సాయిలు, జిల్లా నాయకులు రాజ్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, నారాయణగౌడ్, పేట సాయిలు, శ్రీధర్‌గౌడ్, షేక్ నజీర్, గంపల పోశెట్టి, భూమన్న, దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవానికి రావాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రం లో ని పెద్దమ్మ ఆలయం లో ఏప్రిల్ 14,15 వ తేదీలలో పెద్దమ్మ ఆలయం వారిషికోత్సవం సందర్భంగా పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవం, బోనాల పండుగకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ రావాలని దోమకొండ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మణ్, సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌కు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని విప్ నివాసంలో ఆదివారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా విప్‌ను ముదిరాజ్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అలాగే ఈ వేడుకలకు రావాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ కాటిపల్లి వెంకట రమణరెడ్డిని ముదిరాజ్ సంఘం దోమకొండ అధ్యక్షులు పున్న లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం పండగ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి బోయిని సత్యం, ఉప కార్యదర్శి నాగారపు రాజు, కోశాధికారి కమిండ్ల నర్సింలు, ముఖ్య సలహాదారులు కమిండ్ల కృష్ణ, మాజీ అధ్యక్షులు రాములు, డైరెక్టర్‌లు పాల్గొన్నారు

పలు గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. మండలంలోని భవానిపేట్ గ్రామంలో రూ.ఐదు లక్షల నిధులతో, బాణాపూర్ తాండలో రూ. ఐదు లక్షల నిధులతో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.సర్పంచ్‌లు నరసమ్మ, బర్‌సింగ్, ఉపసర్పంచ్ సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ సురేందర్, గ్రామ అధ్యక్షులు మదర్ భాష, వార్డ్ మెంబర్స్ తర్ర సాయిలు, కొండి రమేష్, గ్రామ పెద్దలు ప్రకాష్, మనోహర్ డి.నారాయణ, రాజు, అస్కుల సాయిలు, జీవన్, కమ్మరి పాండరి, బెస్త శీను, బెస్త రాములు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాగునీరు అందించేందుకే రిజర్వాయర్లు

- పనులను త్వరగా పూర్తి చేయాలి
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- పనులు ప్రారంభం

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మారుమూల ప్రాంతాల రైతులకు సైతం సాగునీరు అందించడం కోసమే రిజర్వాయర్లను నిర్మిస్తున్నట్టు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆదివారం మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో గల చెరువు వద్ద రిజర్వాయర్ నిర్మించేందుకు గానూ రూ.కోటి 20లక్షలతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దాపూర్ రిజర్వాయర్ ద్వారా రెండు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని దీనితో మెట్ట పంటలతో పాటు వరి పంటను పండించుకునే ఆస్కారం గిరిజన బిడ్డలకు దక్కిందని తెలిపారు. రిజర్వాయర్ పనులను చేపట్టే విధానాన్ని పరిశీలించారు. నిర్మాణానికి కావాల్సిన మొరం, సిమెంటును కలిపే మిషన్ పని విధానాన్ని పరిశీలించారు. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యతతో కూడిన పనులను చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నియోజకవర్గంలో చందూర్, జాకోర ప్రధాన నిజాంసాగర్ కెనాల్ వద్ద ఎత్తిపోతల పనులు కూడా ప్రారంభమైనట్టు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ హరిదాస్, మండలాధ్యక్షులు గిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, సర్పంచ్ కల్లా భాయ్ దశరథ్, సీనియర్ నాయకులు మేక వీర్రాజు సత్యనారాయణ, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న స్పీకర్

స్పీకర్‌ను సన్మానించిన హనుమాన్ స్వాములు..

చందూర్ మండల పరిధిలో గల పంచాయతీలకు జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులను స్పీకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చందూర్, ఘన్పూర్, లక్ష్మాపూర్, కారేగాం, మేడిపల్లి తాండకు చెందిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు స్పీకర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో నూతనంగా ఏర్పడిన చందూర్ మండలం అన్ని రంగాలలో అభివృద్ధిని సాధిస్తూ జిల్లాలోనే ప్రత్యేకతను చాటుకుంటున్నందున స్పీకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా చందూర్ మండల ప్రజల తరపున శ్రీరామ నవమి ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, గంగాధర్, దేవి సింగ్, రవి, ఎంపీటీసీ శ్యాంరావ్, మండలాధ్యక్షుడు మూడ్ అంబర్ సింగ్, పాక్స్ అధ్యక్షుడు ప్యారం అశోక్, మాజీ పాక్స్ అధ్యక్షుడు మద్దూరి మాధవ్‌రెడ్డి, హనుమాన్ స్వాములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యమని సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సహకార సంఘంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో సొసైటీ లావాదేవీలను సీఈఓ సందీప్ కుమార్ సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతులను రాజు చెయ్యడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని అన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు పెట్టుబడుల కోసం ఎకరానికి సంవత్సరానికి రూ.10 వేలు రైతు బంధు పథకం ద్వారా, ఒకవేళ రైతు మరణిస్తే రైతు కుటుంబానికి రూ.5లక్షల బీమా సాయం అందిస్తున్నారని తెలిపారు. అలాగే సొసైటీ ద్వారా రుణాలు పొందిన వారు ఈ నెల 31 నాటికి రుసుము చెల్లించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ సంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు దస్త రెడ్డి, సాయగౌడ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సొసైటీ చైర్మెన్

నసురుల్లాబాద్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండలంలోని మైలారం మాజీ సర్పంచ్ కె.శివరాం జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం చలివేంద్రాన్ని మైలారం సొసైటీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, జిల్లా పరిషత్ కోఆప్షన్‌మెంబర్ మజీద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ.. యెండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్టు చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం సొసైటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్‌కు శివరాం కుటుంబ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఫోరం మాజీ కన్వీనర్ కంది మల్లేష్, శివరాం కుటుంబ సభ్యులు యువకులున్నారు.

ఆదరిస్తే అభివృద్ధి చేస్తాం

నవతెలంగాణ-వర్ని/బోధన్

తమను వచ్చే ఎన్నికల్లో ఆదరిస్తే అభివృద్ధి చేస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండలంలోని శ్రీనగర్ గ్రామంలో రాష్ట్ర నాయకులు విట్టల్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ హయంలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని గురించి ప్రజలకు వివరించారు. మళ్లీ తెలంగాణ రాష్ట్ర ప్రజలు టీడీపీని ఆదరిస్తే పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేస్తారని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్‌లో ఇంటింటికి తెలుగుదేశం..

బోధన్ : పట్టణంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్, చంద్రబాబు పాలనలో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు, మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దుచేసి, రెండు రూపాయలకే కిలో బియ్యం ఇచ్చి, పేదలకు పక్కా ఇండ్లు నిర్మించిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబుదేనని అన్నారు. అభివృద్ధితో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాభివృద్ధికి పాటుపాడిన టీడీపీని ఆదరించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సీహెచ్‌వీ హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు పావులూరు వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు కోట గోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు భాస్కర్ రావు, మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సచిన్ పటేల్, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.



వర్నిలో ఇంటింటి ప్రచారం

ప్రభుత్వ ఉపాధ్యాయురాలి ఉదారత



పంపిణీ చేసిన పరీక్ష అట్టలతో విద్యార్థులు

నవతెలంగాణ-జుక్కల్

ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తమ ఉదారత చాటుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ రజని పలువురు పేద విద్యార్థులకు పరీక్ష అట్టలను ఆదివారం పంపిణీ చేసినట్టు జుక్కల్ ప్రధానోపాధ్యాయుడు బస్వంత్ రావ్ పటేల్ తెలిపారు. అనంతరం టీచర్ రజనిని ఉపాధ్యాయ బృందం సన్మానించింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ హామీని అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్‌జిల్లా సీనియర్
- నాయకులు లసుంగారి భూమయ్య

నవతెలంగాణ-బోధన్

అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు లసుంగారి భూమయ్య అన్నారు. ఆదివారం బోధన్ పట్టణం లోని అంబేద్కర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల ఆత్మగౌరవం అయిన (దండోరా) ఎమ్మార్పీఎస్ జెండాను ప్రతి గ్రామ గ్రామాన ఎగురవేస్తామని అన్నారు. అలాగే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై బీజేపీ ప్రభుత్వం నమ్మకద్రోహం చేస్తుందని, మాదిగల ఆవేదనను బీజేపీ ప్రభుత్వం అలుసుగా తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా మోసగిస్తే మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఏప్రిల్ 4న హైదరాబాద్‌లో రహదారుల దిగ్బంధం చేపడతామని హెచ్చరించారు. ఆ నిరసనలో ఎలాంటి ఘటనలు జరిగిన దానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ చేస్తామని చెప్పి బీజేపీ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో కూడా చేర్చి మాదిగలను నమ్మించి మోసం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఇప్పటికి వర్గీకరణను కేంద్రంలో చట్టబద్ధత కల్పించకపోవడం సమంజసం కాదన్నారు. ఇకనైనా బీజేపీ ప్రభుత్వం తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల గ్రామ గ్రామాన మాదిగ ప్రజలందరూ బీజేపీ పార్టీ నాయకులను మాదిగ వాడలోకి రానివ్వమని హెచ్చరించారు. ఈనెల 31న జరిగే కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హైదరాబాద్ నగర రహదారులన్నీ దిగ్బంధం చేయడం కొరకు ప్రతి గ్రామం నుంచి మాదిగ ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షులు తాడెం అబ్బయ్య శంకర్, వినోద్, సగ్గు నగేష్, వీరయ్య దేవదాస్, మొగులవ్వ, కవిత, హనుమవ్వ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

కురుమ యువ చైతన్య సమితి నూతన మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీ

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని స్థానిక బీరప్ప ఆలయం వద్ద కురుమ యువ చైతన్య సమితి (కేవైసీఎస్) మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ కురుమ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులకు నియామకపత్రాన్ని జిల్లా అధ్యక్షులు అందజేశారు.

ఎన్నికైన నూతన మండల కమిటీ..

అధ్యక్షులుగా జోగిని రమేష్, ఉపాధ్యక్షులు బండారి దేవరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొరికాల భూమయ్య, ప్రధాన కార్యదర్శి పెద్దగోని దేవరాజ్, కోశాధికారి మొరికాల మల్లయ్య, ప్రచార కార్యదర్శి కురుమ నవీన్, కార్యదర్శిగా ముత్తి బుచ్చిరాజ్, పుల్ల కనకరాజు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ మాట్లాడుతూ.. కురుమ యువ చైతన్య సమితి సభ్యులు అన్ని రంగాలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ర్యావ శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దోళ్ల మహేష్, అంబల్ల సాయినిఖిల్, జిల్లా ఉపాధ్యక్షులు పుల్ల గంగాధర్, జిల్లా మాజీ అధ్యక్షులు చెట్కురి రజినీకాంత్, జిల్లా కార్యదర్శి విఠల్, మాజీ రాష్ట్ర కార్యదర్శి చెట్టే భాస్కర్, కురుమ మండల పరిధిలోని వివిధ గ్రామాల కురుమ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఐక్యమత్యంతో సమస్యలు సాధించుకుందాం

- స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు
- వింజమూరి రాఘవచారి

నవతెలంగాణ-పిట్లం

ఐకమత్యంతో స్వర్ణకార సమస్యలను సాధించుకుందామని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం తృతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఆ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని అందుకుగాను రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారులు సిద్ధమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మార్వాడి నగల దుకాణాలు వెలియడముతో స్వర్ణకారులకు చేతి పనులు లేకుండా పోయామని, తద్వారా కొందరి కుటుంబాలు అగమ్యగోచరంగా తయార య్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర, జిల్లాల పాలక వర్గంలో కొందరు పని కట్టుకొని తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. స్వర్ణకార రాష్ట్ర కార్యదర్శి చేపూరి వెంకట చారి, కోశాధికారి గొట్టి ముక్కుల చం ద్ర శేఖర్, ఉపాధ్యక్షులు కన్నె కంటి సత్యం, ఆయా జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, స్వర్ణకార సంఘం మండలాధ్యక్షుడు శ్రీధర్‌చారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వింజమూరి రాఘవచారి

రెండవ రోజు శ్రమదానం



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని సింగంపల్లి తండాలో దాస్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఆదివారం రెండవ రోజు శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగంపల్లి తాండ శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలోగల రోడ్డుకి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. నీటి వృధాను అరికట్టే విధానాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నృత్య రూపకంగా ప్రదర్శించారు. విద్యార్థులు గ్రామంలోని నీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎంపిటిసి మీరాబాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.సరిత, మెంబర్ కె.అనిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-మెండోర/మోర్తాడ్

ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి మండల పరిధిలోని చాకిర్యాల్ గ్రామాన్ని సందర్శించి గ్రామానికి చెందిన నోముల రవీందర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామనికి చెందిన తాడెపల్లి నర్సయ్య అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు ఉన్నారు.

మోర్తాడ్ :మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి ఫంక్షన్ హాల్ రామ్‌శ్యామ్ తల్లి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆరంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట సునీల్ యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చొరవతో భీంగల్‌ను మరింత అభివృద్ధి చేశా

- **ఎంపీ అరవింద్‌ను అభివృద్ధిపై ప్రశ్నించండి**
- **మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం**

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ చొరవతో బాల్కొండ నియోజకవర్గంలోని భీంగల్ మండలాన్ని మరింత అభివృద్ధి చేశానని, అందుకు సాక్షం పనులు ప్రజలకు ప్రత్యక్షంగా కనబడుతున్నాయని రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు 14 గ్రామల పార్టీ నాయకులతో కలిపి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం లింబాద్రి గుట్టపై నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు తన తండ్రి వేముల సురేందర్‌రెడ్డి మూడు విలువైన మాటలు చెప్పాడని అవి పార్టీ పట్ల విధేయత, నాయకుని పట్ల విశ్వాసం కలిగి ఉండడం, ఎన్నుకున్న ప్రజలకు, పార్టీకి సేవ చేయడం అనే నినాదాలతో సీఎం కేసీఆర్‌కు ధ్గగ్గరగా ఉంటూ భీంగల్ మండలంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గత పాలకుల హయాంలో వేముగంటి ప్రాజెక్టు పారెస్ట్ క్లియరెన్స్‌లూ మరుగున పడిందని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్లియరెన్స్ తీసుకువచ్చి రెండో దఫా ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశానన్నారు. అలాగే మరో రెండు కోట్లతో ఏడు గ్రామాల చెరువులకు ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని నింపేందుకు కాల్వలు తవ్వామన్నారు. ఇదేగాక బాల్కొండ నియోజకవర్గ రైతులకు కాళేశ్వరం నీటిని శ్రీరాంసాగర్‌లోకి రివర్స్ పంపింగ్ ద్వారా తీసుకువచ్చేందుకు 1200 కోట్లతో పునర్జీవ పథకం ద్వారా 21 ప్యాకేజీకి శ్రీకారం చుట్టామన్నారు. పంటపొలాలకు నీటిని అందించేందుకు అదనంగా 750 కోట్ల వ్యయంతో పైపులైన్‌లను నిర్మించామని తెలిపారు. ప్రస్తుతం మండలంలోని చేంగల్, బడా భీంగల్, యంజి తాండలలో పనులు దాదాపు పూర్తయ్యాయని, మరో 15, 20 రోజుల్లో నీటిని తెచ్చి రైతులకు చూయిస్తానని మంత్రి తెలిపారు. అంతేకాకుండా ప్రతి గ్రామంలో డబుల్ రోడ్లు, రైతులకు పంటసాయంతో పాటు పెన్షన్లు, కల్యాణలక్ష్మి లాంటి పథకాలను ప్రవేశపెడుతు పెద్దన్నగా నిలుస్తున్నాడన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న మంత్రి

అభివృద్ధిపై యంపిని ప్రశ్నించండి

ప్రజలు ఓట్లు వేసి గెలిపించినందుకు వారికి పనులు చేసి చూయిస్తున్నామని, కానీ అదే ఓట్లతో గెలిచిన యంపి అరవింద్ చేసిన పనులను గూర్చి ఒకసారి ప్రజలు ఆలోచన చేయాలని తెలిపారు. మండలంలో ఎంత అభివృద్ధి చేశాడో ఎంపి గ్రామాలకు వచ్చినపుడు ప్రశ్నించాలన్నారు. అలాగే మోడీ ప్రభుత్వం దేశంలో నిత్యావస సరుకుల ధరలు పెంచి సామాన్య ప్రజలకు నడ్డీవిరుస్తున్నాడని తెలిపారు. తెలిపారు.

మహిళ సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మహిళల సాధికారతే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని మంత్రి అన్నారు. మండలకంద్రంలోని సహస్ర పంక్షన్‌హల్‌లో ఐకెపి ద్వారా వడ్డీ రాయితీ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఐకెపీ ద్వారా వడ్డీ లేని రుణాలను అందిస్తు అండగా నిలుస్తున్నామని అన్నారు. అనంతరం భీంగల్, ముచ్కూర్ నిర్మాణం పూర్తి అయిన డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌న్ ప్రారంబించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డీఆర్‌డీప పీడీ చందర్‌నాయక్, జెడ్పీటీసీ చౌట్‌పల్లిరవి, ఎంపిపి ఆర్మూర్ మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, ఏయంసీ చైర్మన్ గుణ్‌వీర్ రెడ్డి , డీపీఎం శ్రీనివాస్, ఏపియం కుంట శ్రీనివాస్, సీసీలు నరేష్, భాస్కర్, మరియ 14 గ్రామాల సర్పంచ్‌లు, యంపిటీసిలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లారంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు



వీధులను శుభంచేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిషిత డిగ్రీ కళాశాల అటానమస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంపును మల్లారం గ్రామంలో ఈనెల 25 నుండి 31 వరకు వివిధ రకాల కార్యక్రమాలను చేపడుతున్నట్లు కళాశాల చైర్మన్ నిఖిల్, కోఆర్డినేటర్ రాజు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్ హాజరయ్యారు. నిషిత కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం మల్లారం గ్రామంలో రోడ్లపై ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ యూనివర్సిటీ ఎంఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్ మాట్లాడుతూ.. నిషిత కళాశాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ.. సమాజంపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని తమ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ రాజు మల్లారం సర్పంచ్ నగేష్ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

28న నిరాహార దీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

బహుజన్ సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 28న ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు బహుజన సమాజ్ పార్టీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఇన్చార్జిని నీరడి లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నీరడి లక్ష్మణ్ మాట్లాడుతూ.. టీఎస్పీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్‌లీక్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీఎస్పీఎస్సీ కేసు సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలన్నారు. లేకుంటే బహుజన్ సమాజ్ పార్టీ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా మార్చ్ 28న ఒక రోజు నిరహార దీక్షను ధర్నాచౌక్ నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి నిరుద్యోగులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై దీక్షను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అర్బన్ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్, ఉపాధ్యక్షులు షకీల్ అహ్మద్, సభ్యులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మంచిప్పలో సీసీరోడ్డుకు భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామంలో సిసి రోడ్ల పనులకు సర్పంచ్ ఇందూరి సిద్దార్థ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. ప్రతి గ్రామంలో డ్రైనేజ్ సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ నుండి 15 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, ఆ నిధుల నుండే సిసి రోడ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో విలేజ్ కమిటీ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయకు లిటిల్ ఫ్లవర్ విద్యార్థిని

నవతెలంగాణ-నవీపేట్



మండలకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ పాఠశాల విద్యార్థిని కృతి సహస్ర జవహర్ నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ హన్మండ్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో తొమ్మిదవ తరగతిలో జవహర్ నవోదయ ప్రవేశానికి 4 సీట్లకుగాను నవోదయ ఎంట్రన్స్ రాయగా సహస్ర సీటు సాధించింది. కరస్పాండెంట్ హన్మాండ్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉపాధ్యాయ బృందం కృతి సహస్రను అభినందించారు.

నాణ్యతతో పనులు చేయాలి

సర్పంచ్ రూప సతీష్ రెడ్డి



పనులను ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన 10 లక్షల రూపాయలతో గ్రామంలో సిసి రహదారి నిర్మాణ పనులను సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మిగిలిపోయిన చోటా కూడా ప్రభుత్వం నుండి నిధులు వచ్చిన వెంటనే పూర్తి చేస్తామన్నారు. సిసి డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని, పనుల్లో నాణ్యత పాటిస్తూ పూర్తిచేసే విధంగా కాంట్రాక్టర్ చూడాలని సర్పంచి పానుగంటి రూప సతీష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఎంబడి సంతోషం, ఉప సర్పంచ్ శుద్ధ గంగారం, సొసైటీ వైస్ చైర్మన్ గంగారం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏంబడి రెడ్డి, నరహరి, వార్డు సభ్యులు గణేష్, సాయిలు, శ్రీను, భూమయ్య, భూషణ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ వారి శిక్షణ



సమావేశంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ ఆధ్వర్యంలో 'పెట్స్ అండ్ సెట్స్ " 2023-24కు ఎన్నికైన ఎలెక్ట్ ప్రెసిడెంట్, ఎలెక్ట్ సెక్రెటరీ శిక్షణ కార్యక్రమం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ లో ఎలెక్ట్ డి. జి శంకర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ 2023-24 గాను ఎన్నికైన అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారీ తులసికి ఎలెక్ట్ డి.జి . శంకర్ రెడ్డి రోటరీ బ్యాచ్ పిన్ చేసి రోటరీ క్లబ్ విద్యా, వైద్యం వంటి సేవలు విద్యార్థులకు, ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ జిల్లాల రోటరీ ఎలెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

వల్లభపూర్ గ్రామానికి జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డు

నవతెలంగాణ-మాక్లూర్



అవార్డు అందుకుంటున్న సర్పంచ్

మండ లంలోని వల్లభాపూర్ గ్రామ పంచా యతీకి జాతీయస్థాయి ఉత్తమ పంచా యతీ అవార్డును మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేతులమీదుగా సర్పంచ్ సిలారి మంజుల సుధాకర్ శనివారం అందు కున్నారు. వల్లభపూర్ గ్రామపంచాయతీ జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతిగా ఎన్నిక కావడంతో గ్రామస్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామం జాతీయస్థాయి ఉత్తమ పంచాయతి ఎన్నిక కావడానికి సహకరించిన గ్రామ ప్రజలకు, యువకులకు, గ్రామాభివృద్ధి కమిటీకి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాపరికరాలు ఏవి?

- **యూనివర్సిటీ స్పోర్ట్స్ ఇన్చార్జ్, ఫిజికల్**
- **డైరెక్టర్లపై చర్యలు తీసుకోవాలి**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్ ఇన్చార్జ్, ఫిజికల్ డైరెక్టర్లపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యు అధ్యక్షులు సంతోష్ అన్నారు. ఆదివారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో స్పోర్ట్స్ బోర్డ్ ఉన్నా ఇప్పటి వరకు ఒక్క సమావేశం జరగలేదని, స్పోర్ట్స్‌కు సంబంధించిన పరికరాలు క్రీడాకారులకు అందుబాటులో లేకుండా పోయాయని అన్నారు. క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా గ్రౌండ్ లేదని, యూనివర్సిటీ క్రీడాకారులందరికీ, అనుబంధ కాలేజీల క్రీడాకారులందరికి సౌత్ జోన్, ఆల్ ఇండియా నేషనల్ యూనివర్సిటీ నుంచి వెళ్లడానికి వాళ్లకు ట్రాక్, డ్రెస్ కిట్, ట్రావెలింగ్ ఇతర అన్ని సౌకర్యాలు ఇచ్చి ప్రతి టీంను యూనివర్సిటీ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ నుంచి పంపించాలని అన్నారు. కొన్ని ఆటలకు మాత్రమే ఇచ్చారని, యూనివర్సిటీ అనుబంధ కాలేజీల క్రీడాకారులకు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదని తెలిపారు. అకౌంట్ సెక్షన్ నుంచి స్పోర్ట్స్ అకౌంట్లో అమౌంట్ వచ్చిన తర్వాత కూడా క్రీడాకారులకు ఇవ్వకుండా ప్రభుత్వ ఆఫీసులలో తమ సమస్యల కోసం ప్రజలు ఏ విధంగా తిరుగుతారో, విద్యార్థులకు కూడా రోజుల తరబడి స్పోర్ట్స్ కార్యాలయం చుట్టే తిప్పించుకునే పరిస్థితి దాపురించిందని తెలిపారు. విద్యార్థి సంఘాల దగ్గరికి ఎందుకు వెళుతున్నారని అదికారులు ప్రశ్నించి క్రీడాకారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సంతోష్ వాపోయారు. దీనికి సంబంధించిన ఆధారాలు మా వద్ద ఉన్నాయని, అధికారులు స్పందించకపోతే వారు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. యూనివర్సిటీలో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోసం ఫీజులు చెల్లిస్తున్నారని, నేషనల్‌కు వెళ్లడానికి క్రీడాకారులందరికీ యూనివర్సిటీ నుండే అన్ని సౌకర్యాలతో పంపించాలని అన్నారు. విద్యార్థి సంఘానికి స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ నుంచి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే యూనివర్సిటీ స్పోర్ట్స్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మోహన్, నరేష్, అక్షయ్ తదితరులు ఉన్నారు

ఆహార పొట్లాల పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

దగడ్ ఫర్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు బోయిన్‌పల్లి దగడ్ సాయన్న నేతృత్వంలో మండల కేంద్రంలోని కృష్ణానగర్ కాలనీలోగల యాచకులకు, నిరుపేద కుటుంబాలకు ట్రస్ట్ సభ్యులు ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవివి జిల్లా హెల్త్ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ పేదవారికి ఆహార పొట్లాలను అందజేసి సేవలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నాయక్ వాడి శ్రీనివాస్, సురేష్, వసంత్, అరుణ్, గణేష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టను బాగుచేసుకోవడం అభినందనీయం

- **ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డిగోవర్ధన్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు తెగిపోయిన చెరువు కట్టను తాండవాసులు ఏకమై స్వతహాగా డబ్బులు పెట్టుకుని బాగు చేసుకోవడం అభినందనీయమని తాండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టి నిధులను మంజూరు చేస్తానని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఇందల్ వాయి మండలంలోని గుట్ట కింద తండాను ఆదివారం ఆయన సందర్శించారు. సర్పంచ్ మోహన్ నాయక్ తండలో నెలకొన్న సమస్యలను ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకొని వచ్చారు. ఇప్పటికే నూతన తాండకు గ్రామపంచాయతీ చేయడం జరిగిందని, ఇదే కాకుండా సిసి రహదారులు, డ్రైనేజీ ఇతరత్రా పనులకు నిధులను మంజూరు చేశామని తెలిపారు. గ్రామ పాలన కొనసాగించుకోవడానికి పంచాయతీకి భవనం మంజూరు చేయడం జరిగిందన్నారు. రెండు తాండల మధ్యలో గ్రామపంచాయతీ నిర్మాణంకోసం భూమిని చదువు చేసుకోవడం సంతోషదాయక మన్నారు. తాండ పరిధిలోని మోహన్‌లాల్ కుంట భారీ వర్షాలకు తెగిపోయి దాని చుట్టుపక్కల పంట పొలాల్లో ఇసుకమేటాలు వేసిందని, ఈ చెరువులో నీరు ఉంటే చుట్టుపక్కల భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయని ఎండాకాలంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. దానికోసం అందరితో సమావేశం ఏర్పాటు చేసుకొని డబ్బులు జమ చేసుకొని కట్ట మరమ్మతులు చేసుకోవడం జరిగిందన్నారు అనంతరం అక్కడే ఉన్న సేవాలాల్ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి యువకులతో వాలీబాల్ ఆడారు. తండాలోని సమస్యలను సర్పంచ్ మోహన్ నాయక్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. ఆయన వెంట జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటిసి బాజిరెడ్డి జగన్ మోహన్, ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఐడిసి ఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలివెరి గంగా దాస్, సినియర్ నాయకులు పాశం కుమార్, పరుశు రాం నాయక్, అరటి రఘు తోపాటు తండా వాసులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడం అభినందనీయం

- **మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్**

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ అన్నారు పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో స్కూల్ లీడ్ కాన్ఫరెన్స్ ప్రోగ్రాం శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులతో టిఎల్ఎం లను ప్రదర్శించడం జరిగింది .పట్టణ తహసిల్దార్ ఆఫీస్ విద్యార్థులు సందర్శించి ఆఫీస్ యొక్క ప్రాధాన్యతను చక్కగా వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి , పి రాజ గంగారం కార్యక్రమాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ నైపుణ్యాన్ని ఎంత చక్కగా ప్రదర్శించారని విద్యార్థులను ప్రశంసించారు. అలాగే విద్యార్థులకు కావలసిన ప్రతి కార్యక్రమాన్ని స్కూల్ యజమాన్యం ఎంతో చక్కగా నిర్వహిస్తారని ఇలాగే ముందుకు సాగాలని కోరారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ ప్రిన్సిపల్ దాసు అరవింద్ మధ్య బృందం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంఈవో

హనుమాన్ మందిర అభివృద్ధి కమిటీ సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయత్ నగర్ లోని హనుమాన్ మందిర అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు మానకొండూర్ భాస్కర్ అధ్యక్షతన ఆదివారం హనుమాన్ మందిర ఆవరణలో నిర్వహించారు. ఈసమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా విట్టోభా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా నూకల శేఖర్, కోశాధికారిగా కర్తన్ నవీన్, ఉపాధ్యక్షులుగా రవీందర్ రెడ్డి, జిమ్మి రవి, సంయుక్త కార్యదర్శులుగా ఖాందేష్ సత్యం, పిట్ల శ్రీధర్, యూత్ విభాగం నుండి కార్యనిర్వాహక కార్యదర్శిగా సచిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఏపీపీ, ప్రముఖ క్రిమినల్ న్యాయవాది, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శాలువా పూల మాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గంగా మోహన్ చక్రు, మాజీ కౌన్సిలర్ గుద్దేటి రమేష్, ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు వందన లక్ష్మి నారాయణ, అంబల్ల శ్రీనివాస్, రూపాలి నర్సయ్య, జంబి హనుమాన్ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చౌకే లింగం, అంబల్ల తిరుపతి, స్వామి యాదవ్, దత్తాద్రి, అశోక్, ముత్తెన్న ప్రవీణ్, భరత్, శివ, రాజు తదితర సభ్యులు పాల్గొన్నారు



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్, శ్రీ విష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ నగరంలోని వంశీ హోటల్ లో ఆస్తమా, సిఒపిడి, ఊపిరితిత్తుల జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన వైద్యులు హాజరై మాట్లాడారు . కాలానికనుగుణంగా నూతన వైద్య విధానంతో చేయాల్సిన చికిత్స పద్ధతులను ప్రముఖ పల్మనా లజీ వైద్యులు సదస్సుకు హాజరైన ప్రతినిధులకు సూచించారు. ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ఈ. రవీందర్‌రెడ్డి, నిజామాబాద్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాంచందర్, డాక్టర్ జలగం తిరుపతి రావ్, విష్ణు ఆస్పత్రి అధినేత, ఐఎంఎ కోశాధికారి డాక్టర్ బొద్దుల రాజేంద్ర ప్రసాద్, ప్రముఖ వైద్యులు ఘట్టాని, కవితారెడ్డి, వెంకటరమణ, రమణేశ్వర్, శ్రీశైలం, కరుణాకర్, నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, నాందేడ్, బోధన్ వైద్యులు పాల్గొన్నారు.